

గరిష్టానికి చేరువగా మూసీ
మూసీ నీటిమట్టం గరిష్టస్థాయికి చేరింది. పూర్తి నీటిమట్టం 645 అడుగులకుగాను 642.35 అడుగులకు చేరింది. - 8లో



దైవదర్శనం చేసుకొని..
తీర్థయాత్రలకు వెళ్లి వస్తున్న ట్రావెల్స్ బస్సు.. లారీని ఢీకొట్టడంతో 15మందికి గాయాలయ్యాయి. - 8లో



ఆత్మహత్యాయత్నం
గుర్రంపోడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట తేరాటిగూడెంకు చెందిన రైతు ఆత్మహత్యాయత్నం చేశాడు. - 8లో

న్యూస్‌రీల్

విద్యార్థులను సన్మార్గంలో నడిపించాలి : ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ టూటౌన్: పాఠశాలల్లో చదివే విద్యార్థులు వ్యసనాలకు అలవాటు పడకుండా సన్మార్గంలో నడిచేలా అవగాహన కల్పించాలని జిలా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. గురువారం నల్లగొండలోని లయన్స్ భవన్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ ఆధ్వర్యంలో విద్యార్థులు వ్యసనాల వైపు మళ్లకుండా ప్రభుత్వ ఉపాధ్యాయులకు కల్పించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆల్కహాల్, గంజాయి, పొగ సేవించడం వల్ల జరిగే అనర్థాలను ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు ఉపాధ్యాయులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ బాధ్యులు యారాల ప్రభాకర్‌రెడ్డి, గోలి అమరేందర్ రెడ్డి, కేవీ.ప్రసాద్, జగిని భీమయ్య, రఘుపతి, పుల్లారావు, రామకృష్ణ పాల్గొన్నారు.

డీఎంహెచ్ఓగా డాక్టర్ శ్రీనివాస్



బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ శ్రీనివాస్

నల్లగొండ టౌన్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా డాక్టర్ పుట్ట శ్రీనివాస్ గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆయన సిద్దిపేట జిల్లా నుంచి నల్లగొండకు బదిలీపై వచ్చారు. ఆయనను ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, ఆస్పత్రి సిబ్బంది, పులువురు ప్రోగ్రాం ఆఫీసర్లు కలిసి శుభాకాంక్షలు తెతెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు.

'పాలిటెక్నిక్' ప్రిన్సిపాల్‌గా నరసింహారావు



బాధ్యతలు స్వీకరిస్తున్న నరసింహారావు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సీహెచ్.నరసింహారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న పి.జానకిదేవి సంగారెడ్డికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందేలా చర్యలు తీసుకుంటానన్నారు.

నేటి నుంచి ఓపెన్ డిగ్రీ ప్రాక్టికల్స్

రామగిరి(నల్లగొండ): డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ మొదటి సెమిస్టర్ సైన్స్ విద్యార్థులకు శుక్రవారం నుంచి ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆ యూనివర్సిటీ నల్లగొండ రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ అంతటి శ్రీనివాస్ తెలిపారు. 2వ తేదీన ఫిజిక్స్, బోటనీ, 3న మాథ్స్, జువాలజీ, 4న జియాలజీ, కెమిస్ట్రీ, 5న కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు.

ఉపాధ్యాయులతో నేడు సీఎం సమావేశం

నల్లగొండ: పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులతో శుక్రవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఉపాధ్యాయులు పదేళ్ల నుంచి ఎదురుచూస్తున్న బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల పూర్తి చేసింది. దీంతో ఉపాధ్యాయులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పదోన్నతి పొందిన అన్ని జిల్లాల టీచర్లతో మాట్లాడేందుకు వారితో సీఎం సమావేశం కానున్నారు. ఈ సమావేశానికి పదోన్నతి పొందిన 973మంది ఉపాధ్యాయులను తీసుకెళ్లేందుకు జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది.

డీఈఈ సెట్ సర్టిఫికెట్ల పరిశీలన

నల్లగొండ: జిల్లా కేంద్రంలోని విద్యా శిక్షణ సంస్థలో గురువారం డీఈఈ సెట్–2024 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం ప్రారంభమైంది. తొలిరోజు 400 మంది అభ్యర్థులను పిలువగా 160 మంది హాజరయ్యారని డైట్ ప్రిన్సిపాల్ కె.నర్సింహ తెలిపారు. ఈ ప్రక్రియ ఈనెల 6 వరకు కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కె.నాగేందర్‌రెడ్డి, భానుప్రకాశ్ గౌడ్, మమత, శ్రీనివాసులు, రాధ, గిరిజ పాల్గొన్నారు.

కృష్ణమ్మ పరవళ్లు

సాగర్‌లో 538.80 అడుగులకు చేరిన నీరు



- వేగంగా పెరుగుతూ.. గేట్లను తాకిన నీటిమట్టం
- ఎగువ నుంచి భారీగా వస్తున్న వరద
- నేడు ఎడమ కాలువకు నీటి విడుదల
- రెండేళ్లకు ఆయకట్టు రైతుల్లో ఆనందం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. జల సవ్వడులతో నాగార్జునసాగర్ ఒడికి చేరుతోంది. శ్రీశైలం నుంచి వరద ఉధృతంగా వస్తోంది. దీంతో సాగర్ జలాశయం నీటిమట్టం క్రమంగా పెరిగి నీరు సాగర్ గేట్లను తాకింది. ప్రాజెక్టులో నీటిమట్టం పది రోజుల్లో 29 అడుగులు పెరగగా.. బుధవారం ఉదయం నుంచి గురువారం రాత్రి వరకు ఒక్క రోజులోనే 10 అడుగులు పెరిగింది. గత నెల 24వ తేదీలోగా 503.6 అడుగులు (120.09 టీఎంసీలు) ఉండగా, గురువారం రాత్రికి 538.80 అడుగులకు (185.8360 టీఎంసీలకు) చేరుకుంది. మహారాష్ట్ర, కర్నాటక ప్రాంతాల్లోని పశ్చిమ కనుమల్లో వర్షాలు పడుతుండటంతో అల్మట్టి నుంచి నారాయణపూర్, జూరాలకు, అటు నుంచి శ్రీశైలంకు భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు ఎత్తి సాగర్‌కు నీటిని విడుదల చేశారు. దీంతో శ్రీశైలం నుంచి సాగర్‌కు 4,91,602 క్యూసెక్కుల వరద వస్తోంది. ఈ నేపథ్యంలో కేఆర్ఎంబీ (కృష్ణా నది యాజమాన్య బోర్డు) అనుమతితో ఎడమ కాలువకు శుక్రవారం నీటిని విడుదల చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నలుగురు మంత్రుల నేతృత్వంలో నీటి విడుదల కార్యక్రమం జరగనుంది.

కుడి కాలువకు ఇప్పటికే కొనసాగుతున్న నీటి విడుదల

సాగర్‌లో ఉన్న నీటిలో రెండు రాష్ట్రాల తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేయాలని కేఆర్ఎంబీ గత నెలలో నిర్ణయం తీసుకుంది. దాని ప్రకారం కుడి కాలువ ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు 4.5 టీఎంసీలు, తెలంగాణకు 5.4 టీఎంసీలు కేటాయించింది. అందులో భాగంగా జూలై 17వ తేదీన సాగర్ కుడి కాలువ నుంచి నీటిని విడుదల చేయగా, ఆ తరువాత ఖమ్మం జిల్లాలో పాలేరు కింద తాగునీటికి ఎడమ కాలువకు 1.5 టీఎంసీల నీటిని విడుదల చేసింది. మిగితా నీటిని హైదరాబాద్ తాగునీటి అవసరాలకు సాగర్ వెనుక జలాల నుంచి తీసుకుంటున్నందున ఎడమ కాలువ ద్వారా 1.5 టీఎంసీలను మాత్రమే విడుదల చేసింది. నాలుగు రోజుల క్రితం అది పూర్తికావడంతో నీటి విడుదలను ఆపేయగా, ఆంధ్రప్రదేశ్‌కు ఇంకా 5,944 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. ప్రస్తుతం శ్రీశైలం నుంచి భారీగా వరద వస్తుండటంతో ఇక నుంచి రెండు కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగనుంది. సాగర్ నుంచి కుడి కాల్వకు 4,152 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఏఎమ్మార్పీకి 900క్యూసెక్కులు, ప్రధాన విద్యుదుత్పాదన ద్వారా 22,592 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మొత్తం అవుట్‌ఫ్లో 27,644 క్యూసెక్కులు ఉంది.

సాగర్‌లో క్రమంగా పెరిగిన నీటి మట్టం

తేదీ	నీటి మట్టం (అడుగుల్లో)
జూలై 24	503
25	503
26	505
27	506
28	509
29	512
30	514
31	523
ఆగస్టు1	538

భారీగా వరద

ప్రస్తుతం శ్రీశైలం జలాశయానికి 3,09,600 క్యూసెక్కులు నీరు వచ్చి చేరుతుండటంతో జలాశయం గరిష్ట స్థాయికి చేరుకుంది. శ్రీశైలం ప్రాజెక్టు వద్ద 10 క్రస్ట్ గేట్లను 18 అడుగుల మేర ఎత్తి 4,31,370 క్యూసెక్కులు స్పిల్ వే మీదుగా విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ విద్యుత్ ఉత్పాదన కేంద్రాల ద్వారా 60,232 క్యూసెక్కులు విడుదలవుతోంది. మొత్తంగా సాగర్‌కు 4,91,602 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం గరిష్ట నీటి మట్టం 590 అడుగులు (312.50 టీఎంసీలు) కాగా, ప్రస్తుత నీటిమట్టం 538.80 అడుగులకు (185.8360 టీఎంసీలకు) చేరుకుంది. శ్రీశైలం నుంచి సాగర్‌కు వరద ఇదే తరహాలో ఇంకొద్ది రోజులు కొనసాగితే సాగర్ గరిష్ట నీటి మట్టానికి చేరుకుంటుందని, వారం రోజుల్లోపే గేట్లు ఎత్తాల్సిన పరిస్థితి వస్తుందని అధికారులు చెబుతున్నారు.

ఆయకట్టు రైతుల్లో ఆనందం

ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలని నిర్ణయించడంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఎడమ కాలువ ద్వారా వ్యవసాయానికి 2022లో నీటిని విడుదల చేయగా, పైనుంచి వరదలు లేకపోవడంతో గత వానాకాలం, యాసంగి సీజన్లలో నీరు విడుదల చేయలేదు. దీంతో ఆయకట్టు రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో 6,30,089 ఎకరాలకు గాను సాగునీరు లేక గత సీజన్‌లో ఆయకట్టులో సగం కూడా సాగు కాలేదు. సాగైంది కూడా బోరు బావుల కిందే. ప్రస్తుతం సాగర్‌కు భారీగా వరద వస్తుండటంతో ఈ రెండు సీజన్లలో ఇక ఇబ్బంది ఉండదనే ధైర్యం రైతులకు వచ్చింది.

సాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేయనున్న మంత్రులు

సాగర్ ఎడమ కాలువకు శుక్రవారం నలుగురు రాష్ట్ర మంత్రులు నీటిని విడుదల చేయనున్నారు. భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు నీటిని విడుదల చేస్తారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పాల్గొంటారు. మంత్రులు శుక్రవారం మధ్యాహ్నం 2:30 గంటలకు హైదరాబాద్ బేగంపేట ఎయిర్ పోర్ట్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 3:20 గంటలకు నాగార్జునసాగర్ బుద్ధవనం దగ్గరున్న హెలిపాడ్‌కు చేరుకుంటారు. 3:40 గంటలకు సాగర్ ఎడమ కాలువ హెడ్ రెగ్యులేటర్ వద్దకు చేరుకొని, 4 గంటల వరకు నీటిని విడుదల చేస్తారు. 40 నిమిషాల పాటు డ్యామ్‌ను సందర్శించి, అనంతరం మీడియాతో మాట్లాడుతారు. సాయంత్రం 5:30 గంటలకు బయలుదేరి హైదరాబాద్‌కు వెళతారని నల్లగొండ కలెక్టర్ నారాయణరెడ్డి వెల్లడించారు.



బుద్ధవనం సమీపంలోని హెలిపాడ్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న బాంబ్ స్క్వాడ్

మూడు దశాబ్దాల పోరాట ఫలితం



నల్లగొండలో మంద కృష్ణమాదిగ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

- ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు గ్రీన్‌సిగ్నల్
- రాష్ట్రాలే చేసుకోవచ్చని తీర్పు
- విద్య, ఉద్యోగ రంగాల్లో వర్గీకరణ అమలు చేస్తామని సీఎం ప్రకటన
- సంబురాలు చేసుకున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నల్లగొండ టౌన్: జనాభా దామాషా ప్రకారం ఎస్సీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ మూడు దశాబ్దాలుగా కొనసాగిస్తున్న ఉద్యమానికి ఫలితం దక్కింది. గురువారం సుప్రీం కోర్టు ఏడుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం ఎస్సీ వర్గీకరణ చేసుకునేందుకు రాష్ట్రాలకు వెసులుబాటు కల్పిస్తూ తీర్పునిచ్చింది. రాష్ట్రాలే వర్గీకరణకు అవసరమైన విధివిధానాలు రూపొందించుకునే అవకాశం కల్పించింది. రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తే విద్యా, ఉద్యోగ రంగాల్లో 59 మాదిగ, మాదిగ ఉపకులాలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు దక్కనున్నాయి. ఎమ్మార్పీఎస్ సుదీర్ఘకాలం పోరాటంతో ఎట్టకేలకు ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు అనుకూలంగా తీర్పునివ్వడం, తెలంగాణలో వెంటనే అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో జిల్లా వ్యాప్తంగా మాదిగ, మాదిగ ఉపకులాల నాయకులు సంబురాలు జరుపుకున్నారు.

సుప్రీం కోర్టు తీర్పుపై హర్షం

ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పునివ్వడాన్ని హర్షిస్తూ గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్జీ కళాశాల ఎదుట ఉన్న బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద మంద కృష్ణమాదిగ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. స్వీట్లు పంపిణీ చేసుకుని పెద్ద ఎత్తున టపాసులను కాల్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలంమాదిగ, ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్, మాదిగ ఉపకులాలు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంద కృష్ణమాదిగ పోరాటం ఫలించింది



మూడు దశాబ్దాల పాటు మంద కృష్ణమాదిగ నేతృత్వంలో సాగిన అలుపెరగని పోరాటం ఫలించింది. సుప్రీం కోర్టు వర్గీకరణపై ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకం. కోర్టు తీర్పునకు మాదిగలు, ఉపకులాలు రుణపడి ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వెంటనే అమలు చేయాలి.

– బకరం శ్రీనివాస్‌మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు

పేద ఎస్సీలకు రిజర్వేషన్లు అందుతాయి



ఎస్సీ వర్గీకరణ చేయడం వల్ల మాదిగ, మాదిగ ఉపకులాల్లోని నిరుపేదలకు రాజ్యాంగ ఫలాలు అందనున్నాయి. జనాభా దామాషా ప్రకారం ఎస్సీలకు విద్యా, ఉద్యోగరంగాల్లో రిజర్వేషన్లు అమలు కావడం ద్వారా సమన్యాయం జరగనుంది. మా పోరాటానికి ఫలితం దక్కింది.

– ఇరిగి శ్రీశైలం మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు

పోరాటయోధుడికి ధన్యవాదాలు



ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్ల అలుపెరగని పోరాటం చేసిన ఉద్యమయోధుడు మంద కృష్ణమాదిగకు ధన్యావాదాలు. ఆయన పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణకు కోర్టు అనుకూల తీర్పు ఇచ్చింది. నిరుపేద ఎస్సీలకు విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు అందుతాయి.

– కత్తుల జగన్‌కుమార్, అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

నిరుపేదలకు సైతం రాజ్యాంగ ఫలాలు



సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు కానుంది. తద్వారా రిజర్వేషన్ల పంపిణీ వల్ల మాదిగలు, మాదిగ ఉపకులాల్లోని నిరుపేదలకు సైతం రాజ్యాంగ ఫలాలు దక్కనున్నాయి. విద్యా, ఉద్యోగ రంగాల్లోనూ ఆయా వర్గాలు రాణిస్తారు.

– పెరిక అంజి, కాంగ్రెస్ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు

బీఆర్ఎస్ నిరసన



శాసనసభలో బీఆర్ఎస్ పార్టీ మహిళా ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం నల్లగొండలోని ఎన్జీ కాలేజీ వద్ద తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న ఆ పార్టీ నాయకులు

మాదకద్రవ్యాలను నియంత్రించాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి, చిత్రంలో ఎస్పీ, అదనపు కలెక్టర్ తదితరులు

నల్లగొండ: జిల్లాలో మాదకద్రవ్యాలను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా ఎస్పీ శరద్‌చంద్ర పవార్‌తో కలిసి నిర్వహించిన జిల్లాస్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ కమిటీ (ఎన్ కార్డ్–మాదకద్రవ్యాల నియంత్రణ కమిటీ) సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ముందుగా గంజాయి నియంత్రణపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ఆగస్టు 7నుంచి జిల్లాలో గంజాయి వ్యతిరేక వారోత్సవాలు నిర్వహించి అన్నిరకాలుగా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. పంద్రాగస్టు సందర్భంగా గంజాయి నిర్మూలనపై ప్రత్యేకించి ఒక శకటాన్ని, స్టాల్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ గంజాయిని నియంత్రించేందుకు జిల్లాలో 'మిషన్ పరివర్తన్' ద్వారా పోలీసు శాఖ అవగాహన కల్పిస్తోందన్నారు. విద్యార్థులు గంజాయి వంటి మత్తుమందుల జోలికి వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత విద్యా శాఖ అధికారులపై ఉందన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

5 నుంచి 'స్వచ్ఛదనం–పచ్చదనం'

ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు రాష్ట్రంలో 'స్వచ్ఛదనం–పచ్చదనం' కార్యక్రమాన్ని నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గురువారం ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి శాంతికుమారి హైదరాబాద్ నుంచి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి కార్యక్రమ నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి విధివిధానాలు వివరించారు. ప్రత్యేక అధికారుల నుంచి ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకోవాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, డీఎఫ్ఓ రాజశేఖర్, జిల్లా అధికారులు హాజరయ్యారు.

నకిలీ విత్తనాలపై నిఘా పెట్టాలి

- రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి



గోదాములో ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న చైర్మన్ సుకేత అన్వేష్‌రెడ్డి, నాయకులు

మిర్యాలగూడ: మార్కెట్‌లో నకిలీ విత్తనాలు రాకుండా అరికట్టేందుకు అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ సుకేత అన్వేష్‌రెడ్డి అన్నారు. గురువారం మిర్యాలగూడలోని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ గోదామును పరిశీలించి స్టాక్ వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడనున్న రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఆందోళన చెందవద్దన్నారు. వ్యవసాయాధికారులు.. రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆయన వెంట డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొదిల శ్రీనివాస్, తమ్మడబోయిన అర్జున్, నాయకులు గాజుల శ్రీనివాస్, గంధం రామకృష్ణ, దేశిడి శేఖర్‌రెడ్డి, బత్తుల సాయి ప్రసన్న, అధికారులు కృష్ణవేణి, సంధ్యారాణి, ఆదినారాయణరెడ్డి, వినయ్, నరసింహారెడ్డి తదితరులు ఉన్నారు.

'సీజనల్'ను అరికట్టేలా..

- ఇంటింటా కొనసాగుతున్న ఫీవర్ సర్వే
- 2,68,588 ఇళ్లను సందర్శించిన వైద్యబృందాలు
- 4,750 మంది జ్వరపీడితుల గుర్తింపు
- ఇళ్ల వద్దే పరీక్షలు చేసి మందులు అందజేస్తున్న వైద్యసిబ్బంది



వివరాలు నమోదుచేస్తున్న సర్వే బృందం

నల్లగొండ టౌన్: జిల్లాలో సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, టైఫాయిడ్, ఫైలేరియా వంటి వ్యాధులను ముందస్తుగా గుర్తించి అరికట్టేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా జ్వర(ఫీవర్) సర్వే నిర్వహించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా వారం రోజుల నుంచి సర్వే కొనసాగుతోంది. జిల్లా వ్యాప్తంగా 4,39,302 ఇళ్లల్లో 17,08,073 మందికి పరీక్షలు నిర్వహించడానికి వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఏర్పాట్లు చేసి 1,490 బృందాలను పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలకు కేటాయించారు.

9.78లక్షల మంది వివరాల సేకరణ

జిల్లాలో ఇప్పటి వరకు 2,68,588 ఇళ్లు సందర్శించి 9,78,140 మంది వివరాలు నమోదు చేయడంతోపాటు వారు ఏఏ జబ్బులతో ఇబ్బందులు పడుతున్నారన్న వివరాలు నమోదు చేశారు. వారికి అవసరమైన పరీక్షలను నిర్వహించారు. అందులో 4,750 మంది సీజనల్ వ్యాధుల్లో జ్వరంతో బాధపడుతున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ గుర్తించింది. అవసరమైన వారికి మందులను అందిస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉన్నవారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, ఏరియా, జిల్లా ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారు. దీంట్లో భాగంగానే సర్వే బృందాలు గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, దోమల నివారణపైనా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

వర్షాకాలం సీజన్‌లో వ్యాప్తి చెందే వ్యాధులైన డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిడ్, ఫైలేరియా వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. దోమల నివారణకు అవసరమైన చర్యలను తీసుకోవాలి. ఏమైనా ఇబ్బందులు ఉంటే ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలి. సీజనల్ వ్యాధులు అరికట్టేందుకు వైద్య ఆరోగ్య శాఖ అన్ని చర్యలు తీసుకుంటోంది.

– పుట్ట శ్రీనివాస్, డీఎంహెచ్ఓ

ప్రత్యేక సిబ్బంది నియామకం

జిల్లాలో సీజనల్ వ్యాధులకు ప్రధానమైన దోమల నిర్మూలన కోసం వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేకంగా 20 మంది బ్రీడింగ్ చక్కర్లను నియమించింది. వీరు ఆగస్టు 1వ తేదీ నుంచి డిసెంబర్ 31 వరకు వారికి కేటాయించిన ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తారు. వీరు గతేడాది సీజనల్ వ్యాధులతో ఇబ్బంది పడ్డ ప్రాంతాల్లో పని చేయనున్నారు. ప్రతిరోజూ వంద ఇళ్లు సందర్శించి నీటి నిల్వ ఉన్న తొట్లు, డ్రమ్ములు, గుంతలలో ఉన్న నీటి నిల్వలను తొలగించడంతోపాటు దోమల లార్వాలను నిర్మూలిస్తారు. దోమల వల్ల వ్యాప్తి చెందే వ్యాధులు, వాటి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు.

క్లుప్తంగా

'మట్టపల్లి' అర్చకుడు మృతి


వెంకటనరసింహాచార్యులు (ఫైల్)

మఠంపల్లి: మట్టపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో 40ఏళ్లుగా అర్చకుడిగా పనిచేస్తున్న పరాశరం వెంకటనరసింహాచార్యులు(60) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్సపొందుతూ గురువారం మృతిచెందారు. ఆయనకు భార్య, నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాంగ్రెస్ నాయకుడు సాముల శివారెడ్డి, దేవస్థానం అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు, ఆలయ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు భూక్య మంజీనాయక్ తదితరులు వెంకటనరసింహాచార్యులు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

విద్యుత్ మోటార్ల వైర్లు చోరీ

చిట్యాల: మండలంలోని గుండ్రాంపల్లి గ్రామ పరిధిలో పలువురుర రైతుల వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ మోటార్ల వైర్లను బుధవారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. గురువారం రైతులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లగా విద్యుత్ మోటర్ల వైర్లు చోరీకి గురైనట్లు గుర్తించి చిట్యాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గ్రామానికి చేరుకుని రైతుల నుంచి వివరాలు సేకరించారు. దొంగలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బత్తుల నర్సింహాగౌడ్ కోరారు.

నడిగూడెంలో...

నడిగూడెం: మండల కేంద్రంలోని బృందావనపురం రహదారిలో ఉన్న విద్యుత్ మోటారు వైర్లు గత కొద్దిరోజులుగా చోరీకి గురవుతున్నాయి. పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అజయ్‌కుమార్ తెలిపారు.

విద్యార్థి అదృశ్యం


గుత్తికొండ చరణ్

పాలకవీడు: మండల పరిధిలోని జాన్‌పహాడ్ గ్రామానికి చెందిన 7వ తరగతి విద్యార్థి గుత్తికొండ చరణ్ అదృశ్యమయ్యాడు. విద్యార్థి తండ్రి వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. చరణ్ పాలకవీడు మండలంలోని డెక్కన్ సిమెంట్ పరిశ్రమలోని పాఠశాలలో 7వ తరగతి చదుతున్నాడు. చరణ్ రోజూ బస్సు లేదా ఆటో, ఇతర వాహనాలను లిఫ్ట్ అడిగి వెళ్తుండేవాడు. గురువారం ఉదయం కూడా బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని లిఫ్ట్ అడిగి పాఠశాలకు బయల్దేరిన చరణ్ సాయంత్రం తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో ఎంత వెతికినా చరణ్ ఆచూకీ లభించకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు అతడి తండ్రి పేర్కొన్నాడు. చరణ్ ఆచూకీ తెలిసిన వారు 9581916365 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరాడు.

భూ వివాదంలో పరస్పరం దాడులు

- 14 మందిపై కేసు నమోదు

నల్లగొండ క్రైం: భూవివాదంలో ఒకే కుటుంబానికి అన్నదమ్ములు కర్రలు, ఇనుప రాడ్లతో పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ ఘటన గురువారం నల్లగొండ మండలంలోని నర్సింగ్‌భట్ల గ్రామంలో జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సింగ్‌భట్ల గ్రామానికి చెందిన కారింగ్ వీరయ్యకు 56.14 ఎకరాల భూమి ఉంది. అతడికి నలుగురు కుమారులు ఎల్లయ్య, రామయ్య, మారయ్య, పిచ్చయ్య ఉన్నారు. భూమి పంపకాలు సమానంగా జరగలేదనే విషయంపై గత కొంతకాలంగా అన్నదమ్ముల మధ్య వివాదం నడుస్తోంది. గతంలో కూడా ఇదే విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. నలుగురు అన్నదమ్ముల్లో భూమి ఎక్కువ ఉన్న వారు పొలం నాటేయడంతో గురువారం మరోసారి వారి మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో అన్నదమ్ములు, వారి కుటుంబ సభ్యులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకోగా సమీప రైతులు వచ్చి విడిపించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా 14 మందిపై కేసు నమోదు చేసినట్లు నల్లగొండ రూరల్ ఎస్‌ఐ సైదాబాబు తెలిపారు.

దైవదర్శనం చేసుకుని వెళ్తుండగా..


నుజ్జునుజ్జయిన లారీ, బస్సు ముందుభాగం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

- లారీని ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు
- ఇద్దరు డ్రైవర్లు, 13మంది ప్రయాణికులకు గాయాలు
- క్షతగాత్రులు ఏపీలోని విజయనగరం వాసులు

గరిడేపల్లి: సాయిబాబా భక్తులతో షిర్డీ తదితర తీర్థయాత్రలకు వెళ్లి వస్తున్న ట్రావెల్స్ బస్సు ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టడంతో 15మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన గరిడేపల్లి మండలం కీతవారిగూడెం గ్రామ సమీపంలో గురువారం తెల్ల వారుజామున జరిగింది. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లాకు చెందిన సాయిబాబా భక్తులు జూలై 24వ తేదీన ట్రావెల్స్ బస్సులో షిర్డీకి వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి తమ స్వస్థలానికి వెళ్తూ మార్గమధ్యలోని దేవాలయాలను దర్శించుకుంటూ వస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం నేరేడుచర్ల మండలం దిర్శంచర్ల గ్రామ శివారులో గల 125 అడుగుల సాయిబాబా స్థూపాన్ని దర్శించుకున్నారు. అనంతరం విజయనగరం బయల్దేరి వెళ్తుండగా.. మార్గమధ్యలో గరిడేపల్లి మండలం కీతవారిగూడెం గ్రామ శివారులోని పెట్రోల్ బంక్ సమీపంలో అర్ధరాత్రి దాటిన తర్వాత బస్సు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్, అతడికి సపోర్టుగా ఉండే మరో డ్రైవర్‌తో పాటు 13మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు, ఎస్‌ఐ సైదులు ఘటనా స్థలానికి చేరుకుని బస్సు క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన ఇద్దరు డ్రైవర్లను అతికష్టం మీద బయటకు తీసి హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన ప్రయాణికులను సూర్యాపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడిన వారిని వెంటనే డిచ్చార్జ్ చేశారు. లారీ డ్రైవర్ సల్లా శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రావెల్స్ బస్సు డ్రైవర్ జోగారావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు.

పేదల వైద్యుడికి దక్కిన గౌరవం

- పలు అవార్డులు డాక్టర్ మునీర్ సొంతం


మజ్జిగ పంపిణీ చేస్తున్న మునీర్ (ఫైల్)


డాక్టరేట్ అందుకుంటున్న మునీర్

మిర్యాలగూడ: మిర్యాలగూడ పట్టణంలో పేదలకు ఉచిత వైద్యం అందిస్తూ జనయేత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలను చేస్తూ పేదల వైద్యుడికి పేరొందిన డాక్టర్ మునీర్ అహ్మద్ షరీఫ్ పలు అవార్డులు, పురస్కారాలు అందుకుంటున్నారు. రెండు దశాబ్దాలుగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పలువురి మన్ననలు పొందారు. బెస్ట్ సిటిజన్ ఆఫ్ ఇండియా, సర్దార్ వల్లభాయ్ పటేల్ స్మారక పురస్కారం, కాళోజీ నారాయణరావు అవార్డు, కరోనా వారియర్స్ అవార్డు, రాష్ట్రీయ సేవారత్న అవార్డులు అందుకున్నారు. వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. నిరుపేదలకు దుప్పట్లు, దుస్తులు పంపిణీతో పాటు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. రక్తదాతల దినోత్సవం సందర్భంగా నాటి కలెక్టర్ గౌరవ్ ఉప్పల్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. కోవిడ్ లాంటి విపత్కర సమయంలో నిరుపేద బ్రాహ్మణులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేసి సర్వమత సౌభ్రాతృత్వాన్ని చాటారు. ప్రతి ఏడాది పవిత్ర రంజాన్ మాసంలో నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ కిట్లు పంపిణీ చేస్తున్నారు. పేద విద్యార్థులకు ఆర్థిక చేయూత అందిస్తున్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నం

- రెవెన్యూ అధికారులు బోరు సీజ్ చేశారని పురుగుల మందు తాగిన రైతు


తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు చెన్నమల్లయ్య

గుర్రంపోడు: తన వ్యవసాయ పొలంలోని బోరును రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సీజ్ చేయడంపై బత్తాయి తోట, వరి నారు ఎండుతుందనే ఆవేదనతో ఓ రైతు తహసీల్దార్ కార్యాలయం ముందు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన గురువారం గుర్రంపోడు మండల కేంద్రంలో జరిగింది. స్థానికులు, బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రంపోడు మండలం తెరాటిగూడెం గ్రామానికి చెందిన కసిరెడ్డి చెన్నమల్లారెడ్డి తాను సొంతంగా కొనుగోలు చేసిన భూమిలో బోరు వేసుకోగా.. అతడి అన్న కసిరెడ్డి రామకృష్ణారెడ్డి తన బోరు దగ్గర వేశారని పదిరోజుల క్రితం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఆర్‌ఐ మురళీకృష్ణ గ్రామానికి వెళ్లి బోరును సీజ్ చేశాడు. వారం రోజులుగా తన బత్తాయి తోట నీరు లేక వాడు పట్టిందని, నారు మడి ఎండుతుందని సీజ్ తొలగించాలని రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. గురువారం తహసీల్దార్ కార్యాయానికి వచ్చిన చెన్నమల్లారెడ్డి బోరు సీజ్ తొలగించడం లేదంటూ ఆగ్రహంతో తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగాడు. రెవెన్యూ సిబ్బంది, స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. కిందపడిపోయిన చెన్నమల్లారెడ్డిని పోలీసులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై తహసీల్దార్ జి. కిరణ్‌కుమార్‌ను ప్రశ్నించగా వాల్టా చట్టం మేరకు బోరు సీజ్ చేశామని, విచారణ కొనసాగుతుందని, లా అండ్ ఆర్డర్‌ను దృష్టిలో ఉంచుకుని తాత్కాలికంగా గురువారం సాయంత్రం బోర్ సీజ్ తొలగించామని తెలిపారు. ప్రస్తుతానికి చెన్నమల్లారెడ్డి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, గుర్రంపోడు పీహెచ్‌సీలో స్టమక్ వాష్ చేయించి మెరుగైన చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు.

చిట్యాల వాసి శ్రీశైలం వద్ద మృతి


యాదయ్య

చిట్యాల: మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డు వెంకటాపురానికి చెందిన హమాలీ కార్మికుడు చొప్పరి యాదయ్య(60) విహారయాత్రకు వెళ్లి శ్రీశైలం వద్ద కృష్ణా నదిలో గల్లంతయ్యాడు. యాదయ్య గురువారం తెల్లవారుజామున తోటి హమాలీ కార్మికులతో కలిసి శ్రీశైలం వెళ్లాడు. ఉదయం శ్రీశైలం డ్యాం సమీపంలోని దోమలపెంట వద్దకు చేరుకుని స్నానాలు చేసేందుకుగాను కృష్ణానదిలోకి దిగారు. యాదయ్యతో పాటు వెళ్లిన వారు ముందుగానే నదిలో సాన్నాలు చేయగా చివరగా సాన్నం చేసేందుకుగాను యాదయ్య నదిలోకి దిగాడు. ఇదే సమయంలో ప్రాజెక్టు గేట్ల వద్ద నుంచి అకస్మాత్తుగా వరద నీరు రావటంతో నదిలో ఈత కొడుతున్న యాదయ్య కొంత దూరం కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. వరద నీరు పెద్ద ఎత్తున వస్తుండటంతో తోటి హమాలీ కార్మికులు సైతం ఏమీచేయలేక చూస్తూ ఉండిపోయారు. యాదయ్య జాడ గురువారం సాయంత్రం వరకు తెలియరాలేదు. యాదయ్యకు భార్య ఎల్లమ్మ, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మర్రిగూడ: నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని బైక్ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మర్రిగూడ మండలం రాజాపేటతండాలో గురువారం ఉదయం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజాపేటతండాకు చెందిన చెరుపల్లి శశికుమార్ గురువారం ఉదయం వాకింగ్‌కు వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్నాడు. మర్రిగూడ మండల కేంద్రంలోని చౌరస్తాలో హోటల్ నిర్వహిస్తున్న రాంరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని తానేదారుపల్లికి చెందిన అబ్బనగోని రామకృష్ణ బైక్‌పై హోటల్‌కు వెళ్తూ నడుచుకుంటూ వెళ్తున్న శశికుమార్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శశికుమార్ కాలు విరగగా.. రామకృష్ణ భుజం, ఛాతి భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి క్షతగాత్రుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మర్రిగూడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం క్షతగాత్రులను వారి కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ కె. రంగారెడ్డి తెలిపారు.

రోడ్డు పక్కన ఉల్లిగడ్డలు లూటీ


మరో లారీలోకి బీర్ల కార్టన్లను లోడ్ చేయిస్తున్న పోలీసులు

చౌటుప్పల్: మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామ శివారులో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున బీరు కార్టన్ల లోడుతో వెళ్తున్న లారీని వెనుక నుంచి ఉల్లిగడ్డల లోడుతో వెళ్తున్న లారీ ఢీకొట్టిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదం జరిగిన సమయంలో రోడ్డుపై పడిపోయిన ఉల్లిగడ్డలను, బీర్ల కార్టన్లను స్థానికులు, రోడ్డు వెంట వెళ్లేవారు ఎత్తుకెళ్లారు. ఆ తర్వాత పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వారిని నియంత్రించారు. అనంతరం ప్రమాదానికి గురైన రెండు లారీలను జేసీబీల సహాయంతో పోలీసులు రోడ్డు పక్కకు తప్పించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ క్రమంలో మరిన్ని ఉల్లిగడ్డల బస్తాలు లారీలో నుంచి రోడ్డుపై పడిపోగా పోలీసులు రోడ్డు పక్కకు నెట్టించారు. ఇలా పడిపోయిన ఉల్లిగడ్డలను గురువారం కూడా కొందరు స్థానికులు ఎత్తుకెళ్లారు. ప్రమాదానికి గురైన బీరు కార్టన్ల లారీకి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయగా.. సివిల్, ఎక్సైజ్ పోలీసులు దగ్గరుండి మరో లారీలోకి సరుకును ఎత్తించారు.

గరిష్టానికి చేరువగా మూసీ నీటిమట్టం

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టులో నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరుకుంటోంది. ఎగువ ప్రాంతాల నుంచి మూసీకి 453 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. ఆయకట్టులో వానాకాలం పంటల సాగు కోసం కుడి కాల్వకు 281 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 258 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. మూసీ ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 645 అడుగులు కాగా గురువారం సాయంత్రానికి 642.35 అడుగులకు చేరుకుందని ప్రాజెక్టు ఏఈ ఉదయ్‌కుమార్ తెలిపారు. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 3.78 టీఎంసీల నీరు నిల్వ ఉంది.


నిండుకుండలా ఉన్న మూసీ ప్రాజెక్టు

చికిత్స పొందుతూ లారీ డ్రైవర్ మృతి

చౌటుప్పల్ : మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామ శివారులో విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లారీ డ్రైవర్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి కంటైనర్ తమిళనాడు రాజధాని చెన్నైకి వెళ్తోంది. ఆ క్రమంలో గురువారం తెల్లవారుజామున దండుమల్కాపురం గ్రామ శివారులోని శ్రీఆంథోల్ మైసమ్మ దేవాలయం సమీపంలో అకస్మాత్తుగా కంటైనర్ అదుపు తప్పి డివైడర్ దాటి రహదారి అవతలి వైపునకు వెళ్లింది. ఆ సమయంలో కంటైనర్ కుదుపులకు గురికావడంతో డ్రైవర్ సి. రవి(54)కి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం పోలీసులు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్సపొందుతూ సాయంత్రం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి అస్థిపంజరం లభ్యం

యాదగిరిగుట్ట: మండలంలోని తాళ్లగూడెం గ్రామంలో గురువారం గుర్తుతెలియని వ్యక్తి అస్థిపంజరం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్లగూడెం గ్రామ రెవెన్యూ పరిధిలోని ఎస్‌వీ హైవే సిటీ వెంచర్ రోడ్డు పక్కన గుర్తుతెలియని వ్యక్తి అస్థిపంజరాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి వయస్సు 60 సంవత్సరాలు ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. అస్థిపంజరంపై జంధ్యం, మొలతాడు, నెక్కరు ఉన్నాయని పేర్కొన్నారు. తాళ్లగూడెం కారోబార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ తెలిపారు.

ఫారెస్ట్ అధికారులకు మృతిచెందిన నెమలి అప్పగింత

నల్లగొండ: పట్టణంలోని నందిహిల్స్ కాలనీలో జాతీయ పక్షి నెమలి మృతిచెందింది. గురువారం ఉదయం వాకర్స్‌కు మృతిచెంది ఉన్న నెమలి కనిపించడంతో ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. చనిపోయిన నెమలిని ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో వాకర్స్ వంగాల అనిల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నవీన్, రామకృష్ణ, వెంకన్న, సుధాకర్ తదితరులు ఉన్నారు.

ఏటీఎం కార్డుతో నగదు దోపిడీ

తిప్పర్తి: ఏటీఎం కార్డుతో నగదు తీసుకొని మోసం చేసిన వ్యక్తిపై బాధితుడు గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తిప్పర్తి ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండల పరిధిలోని రాయినిగూడెం వద్ద గల ఎస్సార్ పెట్రోల్ బంక్‌లో జంపాల శ్రవణ్‌కుమార్ పనిచేస్తున్నాడు. ఫిబ్రవరి 22వ తేదీన గుర్తుతెలియని వ్యక్తి బంక్‌కు వచ్చి తనకు డబ్బులు అవసరం ఉన్నాయని చెప్పి తన ఏటీఎం కార్డు స్వైప్ చేసుకుని రూ.20వేలు ఇవ్వాలని శ్రవణ్‌కుమార్‌ను కోరాడు. దీంతో శ్రవణ్‌కుమార్ స్వైపింగ్ మిషన్ ద్వారా ఏటీఎం కార్డు స్వైప్ చేసి రూ.20వేలు సదరు వ్యక్తికి ఇచ్చాడు. కొంత సేపటి తర్వాత శ్రవణ్‌కుమార్ అకౌంట్‌లో డబ్బులు జమకాలేదని గుర్తించాడు. నేటి వరకు కూడా డబ్బులు జమకాకపోవడంతో శ్రవణ్‌కుమార్ గురువారం తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ డి. రాజు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ బాధితుడికి అప్పగింత

భువనగిరి క్రైం: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గురువారం పోలీసులు బాధితుడికి అప్పగించారు. భువనగిరి మండలం వీరవెల్లి గ్రామానికి చెందిన నల్ల ఉపేందర్ గ్రామంలోని కిరాణ దుకాణానికి వెళ్లి ఇంటి వెళ్తుండగా సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. పోలీసులకు ఫిర్యాదు ఇవ్వగా.. మొబైల్ వివరాలు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి ఐఎంఈఐ నంబర్ ఆధారంగా సెల్‌ఫోన్‌ను కనిపెట్టి గురువారం అతడికి అప్పగించారు.

తగ్గిన 'విద్యుత్' ఫిర్యాదులు

- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ఫారూఖీ వెల్లడి

సాక్షి, హైదరాబాద్ : విద్యుత్ సరఫరాలో అంతరాయాలకు సంబంధించిన ఫిర్యాదులు గణనీయంగా తగ్గాయని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ తెలిపారు. 2023 జనవరి-జూన్ మధ్య కాలంలో 5,83,672 ఫిర్యాదులు రాగా, ఈ ఏడాది ఇదే కాలవ్యవధిలో 3,97,934 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది 31.82 శాతం ఫిర్యాదులు తగ్గినట్లు తెలిపారు. సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా 2023 జనవరి-జూన్ మధ్యకాలంలో 35,949 ఫిర్యాదు రాగా, ఈ ఏడాది ఇదే కాల వ్యవధిలో 60.96 శాతం తగ్గుదలతో 14,035 ఫిర్యాదులొచ్చాయని పేర్కొన్నారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించే ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్లు, 1912 టోల్ ఫ్రీ నంబర్ కాల్ సెంటర్ పనితీరుపై గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఫిర్యాదులను సత్వరంగా పరిష్కరించేందుకు గాను 1912 టోల్ ఫ్రీ కాల్ సెంటర్‌తో పాటు ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్లలో ఆధునిక సాంకేతికతను వినియోగించుకుంటున్నామని తెలిపారు. 213 ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్ల కార్యాలయాల సిబ్బంది ఉపయోగించే వాహనాల్లో యాప్ ఆధారిత జీపీఎస్ సాంకేతికను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే సిబ్బంది సంబంధిత ప్రాంతానికి చేరుకుని సత్వర చర్యలు తీసుకుంటున్నారా? లేదా? అనే అంశంపై సమీక్షించడానికి అవకాశం ఉంటుందన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, బిల్లింగ్ ఫిర్యాదులు, బ్రేక్ డౌన్ సమాచారం, ఫీడర్ల సమాచారం, బిల్లింగ్/కలెక్షన్ సమాచారం వంటి వివరాలతో కూడిన సమీకృత డాష్ బోర్డును అందుబాటులోకి తెచ్చామని, దీని వలన రియల్ టైంలో సమాచారం తెలుసుకునే వీలుంటుందన్నారు. 1912 టోల్ ఫ్రీ నంబర్‌తో పాటు ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్లలో 74 మంది సుశిక్షిత ఆపరేటర్లను అందుబాటులో ఉంచి బలోపేతం చేశామన్నారు. ఏకాలంలో 400 ఫిర్యాదులు స్వీకరించే రీతిలో సామర్థ్యం పెంపొందించామన్నారు. ఫిర్యాదుదారులకు కంప్లైంట్ నంబర్ సైతం ఎస్‌ఎంఎస్ ద్వారా పంపిస్తామన్నారు.

స్వర్ణ తాపడానికి అర కిలో బంగారం అందజేత


ఈఓ భాస్కర్‌రావుకు బంగారం అందజేస్తున్న రాంరెడ్డి, అనురాధ దంపతులు, కుటుంబ సభ్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ విమాన గోపురానికి స్వర్ణ తాపడం చేయించేందుకు గాను హైదరాబాద్‌కు చెందిన రాంరెడ్డి, అనురాధ దంపతులు అర కిలో బంగారాన్ని విరాళంగా ఇచ్చారు. గురువారం స్వామిని దర్శించుకున్న రాంరెడ్డి, అనురాధ దంపతులు, కుటుంబ సభ్యులు అర కిలో బంగారు బిల్లలను ఆలయ ముఖ మండపంలోని సువర్ణ పుష్పార్చనమూర్తుల ఎదుట ఈఓ భాస్కర్‌రావుకు అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

- మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి


మాట్లాడుతున్న మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి

మిర్యాలగూడ టౌన్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి అన్నారు. గురువారం మిర్యాలగూడ పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధానమంత్రి ఎస్సీ వర్గీకరణ చేసి మాల, మాదిగల మధ్య చిచ్చు పెట్టారని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం మంద కృష్ణమాదిగకు అనుకూలంగా మార్చుకుందన్నారు. సుప్రీంకోర్టుకు తీర్పును వ్యతిరేకిస్తూ నేడు గ్రామ స్థాయి నుంచి మాలమహానాడు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఈ నెల 9న ఢిల్లీలో జరిగే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొప్పని నరేష్, సోషల్ మీడియా కన్వీనర్ నాగటి జోసఫ్, మాలమహానాడు జాతీయ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సురేష్, డివిజన్ అధ్యక్షుడు వీరయ్య, కరుణాకర్, నగేష్, రవికుమార్, నాయకులు తదితరులున్నారు.

ఆక్రమణకు గురైన భూమిని కాపాడాలని ధర్నా

- గ్రామ పంచాయతీ కార్యాలయానికి తాళం వేసిన సీపీఐ నాయకులు


గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఎస్‌ఐ, ఎంపీడీఓతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

చిలుకూరు : ఆక్రమణకు గురవుతున్న గ్రామ కంఠం భూమిని కాపాడాలని చిలుకూరు మండలంలోని జెర్రిపోతులగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట గురువారం సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అంతకుముందు గ్రామ పంచాయతీ కార్యాలయంలోని సిబ్బందిని బయటకు పంపించి తలుపులు వేశారు. అదే సమయంలో గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్లు కార్యాలయంలోకి వెళ్లి విధులు నిర్వహిస్తుండడంతో సీపీఐ నాయకులు ఒక్కసారిగా కార్యాలయంలోకి వెళ్లి ఆయనతో వాగ్వాదానికి దిగారు. గ్రామ కంఠం భూమిని గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించి సాగు చేసుకుంటున్నారని, ఇదే విషయమై గ్రామ, మండల స్థాయి అధికారులు ఫిర్యాదు చేయగా, వారు సర్వే చేసి గ్రామ కంఠం భూమి అని బోర్డు పెట్టినా సాగు చేసుకుంటున్నారని సీపీఐ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతస్థాయి అధికారులు వచ్చి సమాధానం చెప్పే వరకు గ్రామ పంచాయతీ కార్యాలయానికి తాళం వేయాలని డిమాండ్ చేశారు. దీంతో గత్యంతరం లేక గ్రామ కార్యదర్శి కార్యాలయం నుంచి బయటకు వెళ్లగా.. సీపీఐ నాయకులు కార్యాలయానికి తాళం వేసి ధర్నా కొనసాగించారు.

తాళం తీయించిన ఎస్‌ఐ, ఎంపీడీఓ..

స్థానిక ఎస్‌ఐ సురభి రాంబాబుగౌడ్, ఎంపీడీఓ గిరిబాబు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకొని సీపీఐ నాయకులతో మాట్లాడి కార్యాలయం తాళాలు తీయించారు. ఈ సందర్భంగా సీపీఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గ్రామంలో 1.20 ఎకరాల గ్రామ కంఠం భూమి ఆక్రమణకు గురవుతుందని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేదని మండిపడ్డారు. ఈ విషయంపై మండల స్థాయి అధికారులు చర్యలు తీసుకోకపోతే సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కొద్దిసేపు ఎస్‌ఐ, ఎంపీడీఓతో సీపీఐ నాయకులు వాగ్వాదానికి దిగారు. అనంతరం ఎంపీడీఓ గిరిబాబు ఆర్డీఓతో ఫోన్‌లో మాట్లాడారు. సర్వే చేసి హద్దులు నిర్ణయించి ప్రభుత్వ భూమిని కాపాడుతామని ఎంపీడీఓ తెలియజేయడంతో వారు ధర్నా విరమించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రెమిడాల రాజు, మాజీ సర్పంచ్ రెమిడాల జయసుధ, నాయకులు కాంపాంటి వెంకటయ్య, రాంశెట్టి కోటయ్య, రణబోతు అంజిరెడ్డి, హుస్సేన్, ఇబ్రహీం, మహేష్, సైదులు, భూపాల్‌రెడ్డి, సోమిరెడ్డి, రామయ్య, అబ్దుల్, శ్రీను, లింగరాజు, సునీత, మదార్‌సాబ్, రామనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.